క్లుప్తంగా

నేడు రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ

నర్వ: నేడు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ పెద్దకడ్మూర్‌లో నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, మక్తల్ నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు హాజరవుతున్నారన్నారు. మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముదిరాజ్‌ల గర్జనను విజయవంతం చేయాలి



ధన్వాడ: జిల్లా కేంద్రంలో ఈనెల 6న నిర్వహిస్తున్న ముదిరాజ్‌ల గర్జనను విజయవంతం చేయాలని మండల మత్స్యకార్మికుల సంఘం అధ్యక్షుడు నిరటి నర్సింహులు నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ముదిరాజ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజుల గర్జనకు ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే శుక్రవారం ఉదయం ధన్వాడ పెద్ద చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆనంద్, నర్సింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేపై రైతులకు అవగాహన



మరికల్: పంటలకు డ్రోన్ ఎలా స్ప్రే చేయాలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఐదు నిమిషాల్లో ఎకరా పంటకు డ్రోన్‌తో స్ప్రేచేయొచ్చని, అలాగే తక్కువ సమయంలో రైతులు పంటలకు ఈ విధానంతో మందులు స్ప్రే చేసుకోవచ్చని ఉపసర్పంచ్ శివకుమార్ రైతులకు సూచించారు. దీంతో రైతులపై మందుల ప్రభావం కూడా ఉండదన్నారు.

శేషాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని వినతి

కృష్ణా: మండలంలో శేషాద్రి పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం మక్తల్ పట్టణానికి వచ్చిన మంత్రి హరీష్ రావుకు వినతిపత్రం అందజేసినట్లు మాజీ సర్పంచ్ అమర్‌కుమార్ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మండలంలో కంపెనీఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పిరైతుల నుంచి దాదాపు 300ఎకరాల భూమిని శేషాద్రి పవర్ ప్లాంట్ యాజమాన్యం గత 40సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిందన్నారు. ఆ కంపెనీ యాజమాన్యం ఇప్పటివరకు ఎలాంటి కంపెనీ ఏర్పాటు చేయలేదని, తక్షణమే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు.

కుర్వయాదవులు ఆర్థికంగా ఎదగాలి



కోయిల్‌కొండ: ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంతో గొల్ల కుర్వయాదవులు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కనాయపల్లి గ్రామంలో లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ బడుగు బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం నల్లవల్లి, చంద్రాస్‌పల్లితోపాటు పలు గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండోచైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ నిరూపరాణి, నాయకులు భీంరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు ,బ్రెడ్ల పంపిణీ

పెబ్బేరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గర్భిణులు, రోగులకు బీఆర్ఎస్ నాయకుడు రణధీర్‌రెడ్డి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ గౌస్, వెంకటేష్‌చారి, బబ్లుఅలియా, శ్రీనివాస్, వసంత్, నిప్పి, ఉదయ్, వాన్వాస్, జ్ఞాని, రాకేష్‌రెడ్డి, భాస్కర్, వినోద్ పాల్గొన్నారు.



అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యం

• ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: జిల్లాను విద్యారంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్న సాకారం కాని కలను ప్రభుత్వ పెద్దలను ఒప్పించి ఏయిడెడ్ కళాశాలను ప్రభుత్వ పరం చేయించడంతోపాటు ఉద్యోగ, అధ్యాపకులను న్యాయం చేశామన్నారు. జిల్లాకు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ కింద పాలిటెక్నిక్ కళాశాలతోపాటు ధన్వాడకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అప్పక్‌పల్లి వద్ద మెడికల్ కళాశాలను మంజూరు చేయించామన్నారు. మన ఊరు– మన బడి ద్వారా మూడు విడతలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తున్నామని చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో డీఐఈఓ సుదర్శన్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి ఉపాధ్యాయులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంలో మహిళల సాధికారత

నారాయణపేట: తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతే మహిళలకు సాధికారిత ఏర్పడిందని స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంజనాగార్డెన్‌లో మెప్మా సిబ్బంది మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.. మహిళజనులు ఆర్థిక పరమైన ఇబ్బందుల నుంచి బయటపడి ఇప్పుడు వారు తమ సొంత కాళ్లపై నిలబడ్డారన్నారు. మహిళలకు ప్రభుత్వ ఎప్పుడు అండదండాలు ఉంటాయని మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యేకోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు మేమంతా కృషిచేస్తామని మహిళల సంఘం సభ్యులు భరోసానిచ్చారు. అనంతరం మహిళ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేకు గజమాలతో సన్మానించి కేక్‌కట్ చేయించారు. కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, మహిళసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్:పట్టణంలోని మున్సిపాలిటీని అందరి సహకారంతో అభివృద్ధిచేశామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రూ. 25లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి రంగంలోనూ అందరూ లబ్ధి పొందేలా వివిధ పథకాలు కేసీఆర్ తెచ్చారన్నారు. రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారని ఇప్పటికే లక్ష రుణమాఫీ పొంది సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, రాజేష్‌గౌడ్ ఎమ్మెల్యేను సన్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కమిషనర్ బాల్‌రాం నాయక్, ఏఈ నాగశివ, శ్రీనివాసగుప్తా, నేతాజీరెడ్డి, రాజేష్‌గౌడ్, ఈశ్వర్, శంషోద్దీన్, వావలి ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, సత్యారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణ చెక్కులను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మద్దూరు: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, బతుకమ్మ చీరలు, గ్రామాలకు స్పోర్ట్స్ కిట్లను తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి డీవైఎస్‌ఓ వెంకటేష్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 80మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, భర్త చనిపోయిన వితంతువులకు 44మందికి పింఛన్ పత్రాలు, మహిళలకు బతుకమ్మ చీరలను, 47గ్రామాలకు గాను 54 స్పోర్ట్‌కిట్ పంపిణీ చేశారు. రాని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు వెంకటయ్య, ఏకేరాజు, ఆయా గ్రామా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలని వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న పీటీఐలు

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు విద్యా సంవత్సరంలో ఇచ్చిన డిప్యూటేషన్లు రద్దుచేయాలని బుధవారం డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టర్ చొరవతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన వెలుగు అభ్యాసదీపిక 45రోజుల ప్రణాళిక అమలు ప్రక్రియ కోసం టీచర్ల కొరత ఉన్న చోటకి పీటీఐలను తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై పంపించారని, తమశక్తివంచన లేకుండా విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఆ కార్యక్రమం పూర్తయిన కారణంగా తమను పాత స్థానాలకు పంపిస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శశికాంత్‌రెడ్డి, నారాయణ, సాయినాథ్, కృష్ణకుమార్, మహేశ్వరీ, వరలక్ష్మి, అనిత, అనిల్‌కుమార్, రాంనాథ్ పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన అదనపు కలెక్టర్



కోస్గి: మంత్రి హరీష్‌రావు బుధవారం జిల్లా పర్యటన నేపథ్యంలో కోస్గికి రావడంతో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. పట్టణ శివారులోని బస్‌డిపో సమీపంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకొని మంత్రికి స్వాగతం పలికారు. ఇందులో స్థానిక అధికారులు ఉన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్వామి వివేకనంద చౌరస్తాలో బీజేపీ సీనియర్ నాయకులు రతంగ్‌పాండురెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ గెలుపు ఖాయమన్నారు. నాయకులు రాములుగౌడ్, శ్రీధర్, గోవిందునాయక్, యాదిరెడ్డి, చెన్న తదితరులు పాల్గొన్నారు.

గోటూర్ నుంచి ముగ్గురు కానిస్టేబుల్స్ ఎంపిక

ధన్వాడ: బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్స్ రిజల్ట్స్ మండలంలోని గోటూర్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైయ్యారు. గ్రామానికి చెందిన పల్లెబస్‌రెడ్డి, పంది సింధుజ, సాలె నందిని ఎంపికైయ్యారు. ఈమేరకు.. సర్పంచ్ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

అర్హులకు గృహలక్ష్మి ఇవ్వాలి



నర్వలో ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నర్వ: ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకు అందిస్తున్న గృహలక్ష్మి పథకం అర్హులకు అందించాలని ఎంపీడీఓ సుదర్శన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని యాంకి గ్రామస్తులు బుధవారం గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌కు, ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఆర్‌సీసీతో ఇళ్లు కలిగిన వారిని గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేశారని.. అర్హులకు మాత్రం ఈ పథకానికి ఎంపిక చేయలేదన్నారు. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించాలని వారు కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాము, రాఘవేందర్‌రెడ్డి, సూరి, కురుమూర్తి, సురేష్ తదితరులున్నారు.

ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్సే



మాట్లాడుతున్న తులసీరాజ్‌యాదవ్

ఆత్మకూర్: రాష్ట్రంలో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్ పార్టీ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మక్తల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మక్తల్‌లో జరిగిన బీఆర్ఎస్ సభలో మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టులన్నీ కేసీఆర్ కట్టించారని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదని అబద్ధాలు చెప్పారని, సంగంబండ, భూత్పూర్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను కట్టి సాగునీటిని అందించిన మహానీయుడు వైఎస్ఆర్ అని గుర్తు చేశారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎరుకలి బాలస్వామి, మేకల సింగోటం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకుడు మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.10 వేలు పంపించారు. మండల నాయకులు గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించి, రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిరాజు, ఆశన్న, నవీద్, అంజి, అశోక్, భాను, నవీన్, రఘు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలి



మరికల్‌లో మాట్లాడుతున్న బీఎస్పీ ఇన్‌చార్జి



నర్వలో..

నర్వ: ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు మహేందర్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌ఐ కృష్ణారెడ్డికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఆశలకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు కల్పించాలని ప్రమాదభీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ,సౌకర్యాలుకల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పద్మ, శివలింగమ్మ, లక్ష్మీ, అంజమ్మ, లలిత, మనెమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ మేరకు.. సీఐటీయూ కన్వీనర్ నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాల మణి, శివమ్మ, ఆకాశవాణి, రాధ, జ్యోతి, ప్రియాంక పాల్గొన్నారు.

మరికల్: ప్రభుత్వం ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు పలికి మాట్లాడారు. వారు న్యాయపరమైన సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ భరోసా



విద్యార్థిని సన్మానిస్తున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: నిరుద్యోగులను ఆదుకునేది కాంగ్రెస్ పార్టీయే అని, అధికారంలో వస్తే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని దేవరకొండ మోహన్, మమత దంపతుల కుమారుడు తరణ్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో గురువారం వారి ఇంటికి వెళ్లి శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉపాధి రంగాలకు అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల నోటిఫికేషన్ రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులు దాపరించాయన్నారు. రాబోయే ఎన్నికలలో పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ కార్డులను ప్రజలకు వివరిస్తూ పార్టీ విజయం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆయూబ్‌ఖాన్, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, పోసిరిగారి విష్ణు, తౌఫిక్, కేశవ్ యాదవ్, రామకృష్ణ, కావలి రవి పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నర్వలో సమ్మెలో పాల్గొన్న తపాల ఉద్యోగులు

ఊట్కూరు: గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సంఘం నాయకులు నర్సింహ అన్నారు. సమ్మెలో భాగంగా స్థానిక తపాల కార్యాలయం ఎదుట బుధవారం ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ తపాల ఉద్యోగుల పని పరిస్థితులు, వేతనాల పరిశీలన కోసం నియమించబడిన అంశాలను అమలు పర్చకుండా డిపార్ట్‌మెంట్, కేంద్రప్రభుత్వం కావాలని తపాల ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీడీఎస్‌లకు 8 గంటల పని పెన్షన్‌తో సహ అన్నిరకాల ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాల సిబ్బంది రాజు, హరిసర్వోత్తమరావు, వెంకటయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద ఒకరోజు సమ్మె నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. 8గంటల పని మరియు పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రాంలింగారెడ్డి, కృష్ణనాయక్, సత్యనారాయణరెడ్డి, రేఖ, రాజేందర్‌గౌడ్, చంద్రశేఖర్, వంశీకృష్ణ, భానుచందర్, భరత్, రవితేజ, ప్రవీణ్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన



మాగనూర్‌లో బిక్షాటన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మాగనూర్: మధ్యాహ్నభోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని 9రోజులుగా సమ్మెచేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడానికి నిరసిస్తూ బుధవారం మండలంలో వారు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కో–కన్వీనర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని, తక్షణమేవారి సమస్యలను పరిష్కరించాలన్నారు. జీఓ నెంబర్8 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ప్రమీల, శంకరమ్మ, ఉమా, సారాలక్ష్మి, దేవమ్మ, గంగమ్మ, బాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



మాగనూర్ నుంచి సభకు తరలి వెళ్తున్న నాయకులు



ఊట్కూర్ నుంచి

నర్వ: నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు మండలం నుంచి తరలివెళ్లారు. ఈ మేరకు.. ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, రైతుసమన్వయ సమితి కో–ఆర్డినేటర్ మండ్ల చిన్నయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు కిరణ్‌ప్రకాష్ రెడ్డి, దండు అయ్యప్ప, శంకర్ పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వస్తున్న మంత్రి హరీష్‌రావు అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మండలంలోని ఆయా పంచాయతీల నుంచి బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎల్లారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊట్కూరు: మంత్రి హరీష్‌రావు బహిరంగ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఊట్కూరు, మల్లెపల్లి, అమీన్‌పూర్, పులిమామి తదితర గ్రామాలనుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. మల్లెపల్లి నుంచి ద్విచక్రవాహనాలతో బహిరంగసభకు తరలివెళ్లారు.

ఈకేవైసీ కోసం బారులు



ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన ప్రజలు

మద్దూరు: రేషన్ షాపుల్లో ఈకేవైసీ కోసం ప్రజలు ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరుతున్నారు. రేషన్ షాపుల్లో ఈకేవైసీకోసం ఆధార్ కార్డును, లబ్ధిదారుడి వేలిముద్రలను గతకొంత కాలంగా రేషన్‌షాపుల డీలర్లు లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్నారు. ఈ క్రమంలో చాలాచోట్ల లబ్ధిదారుల వేలిముద్రలు పడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొందరు ఆధార్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు మీ సేవ, ఆధార్ కేంద్రాలను బారులు తీరుతున్నారు. మద్దూరు, కొత్తపల్లి రెండు మండలాలకు కలిపి ఒకే ఆధార్ సెంటర్ ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మీసేవా అధికారులు, ఆధార్ సెంటర్ నిర్వహకులు చెప్పిన ప్రజల మాత్రం పనులు వదులుకొని మరి క్యూకట్టి అధార్ సెంటర్‌లో పడిగాపులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.